రైతుసంఘం జిల్లా అధ్యక్షునిగా భాస్కరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడిగా కట్టా భాస్కరరావు ఎన్నికయ్యారు. స్థానిక అన్నే భవనంలో బుధవారం జరిగిన రైతుసంఘం జిల్లా విస్తృత సమావేశంలో జిల్లా అధ్యక్షునిగా భాస్కరరావు ఎన్నిక జరిగినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. జిల్లాలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాలో రైతుసంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.

పంట నష్టం @ రూ.16 కోట్లు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



నూజివీడులో పెదచెరువుకు గండిపడడంతో దెబ్బతిన్న పంటపొలం

వరదలకు దెబ్బతిన్న పంటనష్టం లెక్కలను అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం 16,030 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా ఎకరాకు రూ.పది వేలు చొప్పున రూ.16 కోట్లు నష్టపరిహారంగా రైతులకు అందించాలని లెక్క తేలింది. పంటనష్టం నమోదులో పూరిస్థాయిలో కౌలురైతుల పేర్లు నమోదు కాకపోవడంపై రైతుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జులైలో, సెప్టెంబర్ మొదటివారంలో రెండుసార్లు వరదలు విరుచుకుపడ్డాయి. వరదలకు రెండు జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల ముంచెత్తిన వరదలకు పశ్చిమగోదావరి జిల్లాలో 8,546 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.పది వేలు చొప్పున రూ.8.55 కోట్లు పరిహారం రైతులకు అందించాల్సి ఉందని లెక్కలుగట్టారు. ఏలూరు జిల్లాలో 18 మండలాల్లో వరి, మినుము, పత్తి, పెసర, వేరుశెనగ, చెరకు, మొక్కజొన్న పంటలు మొత్తంగా 7,484 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అత్యధికంగా 5,639 ఎకరాల్లో వరిపంట, 1,602 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి రూ.7.48 కోట్లు పంట నష్టపరిహారంగా రైతులకు అందించాల్సి ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ రెండుసార్లు వరదలు, భారీవర్షాలు దెబ్బతీశాయి. జులైలో వరదలకు పశ్చిమగోదావరి జిల్లాలో 12,957 ఎకరాల్లో వరి దెబ్బతినగా రూ. పది కోట్లు నష్టపరిహారం రైతులకు అందించాలని అధికారులు తేల్చారు. ఏలూరు జిల్లాలో 350 ఎకరాల్లో పంట నష్టపోగా రూ.కోటి వరకూ నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి నివేదించారు. రెండుసార్లు ముంచెత్తిన వరదలకు రెండు జిల్లాల్లో 29,337 ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకూ రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం సొమ్మును ఎకరాకు రూ.6,800 నుంచి రూ. పది వేలకు పెంచడం కొంత ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. పంటనష్టం లెక్కలు తేలిపోవడంతో పరిహారం సొమ్ము ఎప్పటికి చెల్లిస్తారో వేచిచూడాలి.

ఇ-క్రాప్‌లో ఉంటేనే కౌలురైతుల పేర్లు నమోదు

పంటనష్టం నమోదులో సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లే నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా సాగుతుందని కౌలురైతులు గగ్గోలు పెడుతున్నారు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. ఇందులో సగం మందికి కూడా ప్రభుత్వం కౌలుకార్డులు జారీచేయలేదు. కౌలుకార్డులు అందుకున్న రైతుల పేర్లు మాత్రమే ఇ-క్రాప్‌లో నమోదయ్యాయి. పంటనష్ట నమోదు ఇ-క్రాప్ ఆధారంగానే అధికారులు పూర్తిచేశారు. ఇ-క్రాప్‌లో పేర్లు లేని కౌలురైతుల వివరాలు పంట నష్టపరిహారం జాబితాలో చేరలేదని రైతులు చెబుతున్నారు. కౌలుకార్డు లేని కౌలురైతుల పేర్లు నమోదు చేస్తే భూయజమానులు వ్యవసాయ అధికారులపై ఘర్షణలకు దిగినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఇ-క్రాప్ ఆధారంగానే పంటనష్టం నమోదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పంట నష్టపోయిన వాస్తవ సాగుదారులకు పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కౌలురైతుల నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి.

> రెండు జిల్లాల్లో 16,030 ఎకరాల్లో పంటలకు దెబ్బ
>
> ఏలూరు జిల్లాలో 7,484, పశ్చిమలో 8,546 ఎకరాలు
>
> ప్రభుత్వానికి నివేదికలు పంపిన వ్యవసాయాధికారులు
>
> జులైలో వరదలకు 13,307 ఎకరాల్లో రూ.11 కోట్ల పంటనష్టం
>
> కోలుకోలేని స్థితిలోకి అన్నదాత
>
> ఇ-క్రాప్‌లో ఉంటేనే కౌలురైతుల పేర్లు నమోదు

కొత్త మద్యం పాలసీ షురూ..!

> నూతన మద్యం పాలసీకి కేబినెట్ ఆమోదం
>
> టెండర్ల ప్రక్రియ ద్వారా దుకాణాల కేటాయింపు
>
> ప్రస్తుతం రెండు జిల్లాల్లో 270 మద్యం దుకాణాలు
>
> కొత్త పాలసీలో 300కుపైగా దుకాణాలు పెరిగే అవకాశం
>
> క్వార్టర్ కనిష్ట ధర రూ.90 ఉండేలా నిర్ణయం
>
> గౌడ సామాజిక తరగతికి 10 శాతం దుకాణాల కేటాయింపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నూతన మద్యం పాలసీ అమలుకు రాష్ట్ర కేబినెట్ బుధవారం ఆమోద ముద్ర వేసింది. గత ప్రభుత్వ మద్యం పాలసీలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని, దాన్ని రద్దు చేస్తూ కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. వైసిపి హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపింది. ఏలూరు జిల్లాలో 151, పశ్చిమగోదావరిలో 119 మొత్తం 270 మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహించింది. మద్యం ధరలను భారీగా పెంచి అమ్మకాలు సాగించింది. క్వార్టర్ మద్యం ధర కనిష్ఠంగా రూ.130 నుంచి అత్యధికంగా రూ.660 వరకు అమ్మకాలు సాగించింది. దీనిపై మందుబాబుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అంతేకాకుండా నాణ్యమైన మద్యం విక్రయించకుండా నాసిరకం మద్యం విక్రయించడంతో ఎంతోమంది రోగాల పాలయ్యారనే విమర్శలు విన్పించాయి. దీంతో తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తేవడంతోపాటు ధరలు తగ్గిస్తామని కూటమి హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొస్తోంది.

టెండర్ల విధానంలో దుకాణాల కేటాయింపు..!

నూతన మద్యం విధానంలో టెండర్ల ప్రక్రియ ద్వారా దుకాణాలు కేటాయించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. టెండర్ల ప్రక్రియను లాటరీ పద్ధతిలో నిర్వహించనున్నారు. దుకాణాలు పొందాలనుకునేవారు పూచీకత్తు కింద రెండు లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ సొమ్మును తిరిగి చెల్లించడం ఉండదు. ప్రస్తుతం రెండు జిల్లాల్లో 271 మద్యం దుకాణాలు ఉండగా కొత్త పాలసీలో ఈ సంఖ్య 300 దాటే అవకాశం కన్పిస్తోంది. గతంలో టెండర్ ప్రక్రియ ద్వారా మద్యం విధానం నడిచినప్పుడు ఉమ్మడి జిల్లాలో 473 మద్యం దుకాణాలు ఉండేవి. ఇప్పుడు కూడా అదేస్థాయిలో జిల్లాలవారీగా దుకాణాలు ఉండే అవకాశం నెలకొంది. నూతన మద్యం విధానంలో క్వార్టర్ మద్యం ధర కనిష్టంగా రూ.90 ఉండేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

గౌడ సామాజిక తరగతికి పది శాతం దుకాణాలు..!

నూతన మద్యం పాలసీలో దుకాణాల కేటాయింపులో పది శాతం దుకాణాలను గౌడ సామాజిక తరగతికి కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

బెల్ట్ షాపులు పెరిగే అవకాశం

నూతన మద్యం విధానంతో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా పెరిగే అవకాశం కన్పిస్తోంది. దుకాణాలు దక్కించుకున్న వారు మద్యం అమ్మకాలు పెంచుకునేందుకు గ్రామగ్రామాన బెల్ట్ షాపులను ప్రోత్సహించే అవకాశం ఉంది. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వంలో బెల్ట్‌షాపులు విపరీతంగా కొనసాగాయని విమర్శలు వెల్లువెత్తాయి. నూతన మద్యం పాలసీ అమలుతో మరోసారి బెల్ట్‌షాపులు పెరిగే అవకాశం ఉంది. బెల్ట్ షాపులను ఏ విధంగా అరికడతారో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది.

వాలంటీర్లపై చర్చ..!

వాలంటీర్ల కొనసాగింపుపై మంత్రి మండలిలో చర్చ సాగింది. దీంతో వాలంటీర్లలో కొత్త ఆశలు చిగురించాయి. వాలంటీర్ వ్యవస్థ పునరుద్ధరించి తమకు ఉపాధి కల్పించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఏ విధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

అజ్ఞాత శక్తులెవరో బయటపడేనా..!

శశికుమార్ నోరు విప్పితేనే నిజాలు వెలుగులోకి - సంచలనం సృష్టిస్తున్న బాలికలపై లైంగిక వేధింపుల వ్యవహారం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్, సిటీ, అర్బన్

నగరంలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలోని బాలికల వసతి గృహంలో వెలుగు చూసిన లైంగిక వేధింపుల ఘటన తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. పలువురు బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన శశికుమార్‌పై మంగళవారం రాత్రి కేసు నమోదైంది. శశికుమార్ చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహంలో గ్రేడ్-2 వార్డెన్‌గా పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి శశికుమార్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఈ వసతిగృహం నిర్వాహకులురాలు, ప్రధాన నిందితుని భార్య ఫణిశ్రీ, కేర్‌టేకర్‌గా పని చేస్తున్న ఫణిశ్రీ మేనకోడలు లావణ్యలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విచారణలో శశికుమార్ పలువురు బాలికలపై లైంగిక దాడి పాల్పడినట్లు, అలాగే పలువురు మహిళలను ప్రలోభపెట్టి మోసగించినట్లు వెల్లడైందని తెలుస్తోంది. అయితే శశికుమార్‌ను అదుపులోకి తీసుకున్న విషయాన్ని పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు.

అజ్ఞాత శక్తులు బయటపడేనా..!

అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహించడం, ఆపై బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడటం వెనుక పలువురు రాజకీయ ప్రముఖులు, జిల్లా అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే పోలీసుల విచారణ, దర్యాప్తులో సెల్‌ఫోన్, కంప్యూటర్లలో పలువురు బాలికలపై అఘాయిత్యాలకు సంబంధించిన అంశాలను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. బాలికలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడంతోపాటు నగరంలోని కొందరు నేతలు, జిల్లా అధికారులకు సైతం అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసుల విచారణ సక్రమంగా సాగేనా.. అజ్ఞాత శక్తుల భాగోతం వెలుగుచూసేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శశికుమార్ గతంలో డెల్టాలోని ఓ హాస్టల్‌లో పని చేసినప్పుడు ఇటువంటి అకృత్యాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రం నడిబొడ్డులో.. జిల్లా అధికారులంతా సంచరించే ప్రాంతంలో ఎటువంటి అనుమతులూ లేకుండా దర్జాగా హాస్టల్ నిర్వహణకు కొందరు జిల్లా అధికారులు, రాజకీయ ప్రముఖుల అండదండలే ప్రధాన కారణమని తెలుస్తోంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు సాగించి శశికుమార్ అకృత్యాలకు అండదండలందించిన వారందరినీ అరెస్టు చేస్తేనే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని పలు విద్యార్థి, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి ఈ ఘటనపై ఎలా ముందుకెళ్తారో వేచిచూడాలి.

సమగ్ర విచారణ జరిపించాలి: సిపిఎం

అమీనాపేటలోని ఒక ప్రయివేటు వసతిగృహంలో లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రధాన నిందితుడు శశి కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించి శశికుమార్‌కు అండగా ఉన్నవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వసతి గృహాన్ని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, అందులో ఉంటున్న బాలికల విద్యాభ్యాసానికి, వసతికి ఎటువంటి ఆటంకమూ లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బాలికలపై లైంగిక వేధింపుల కేసులో శశికుమార్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం నగర కార్యదర్శి పి కిషోర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ ఘటన పరిశీలిస్తుంటే ఒక పెద్ద మాఫియాలా కన్పిస్తుందన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని కిషోర్ డిమాండ్ చేశారు. సమావేశంలో బి.జగన్నాథం, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్, విఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు, హైమ, ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై లైంగిక దాడికి, వేధింపులకు పాల్పడిన శశికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని, స్త్రీ విముక్తి సంఘటన ఏలూరు జిల్లా కార్యదర్శి టి.చిన్ని, పిడిఎస్ఒ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నేతల రమేష్ బాబు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

ప్రజారక్షకులుగా పోలీసులు

డిజిపి ద్వారకాతిరుమలరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కలెక్టర్, పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డిజిపి ద్వారకాతిరుమలరావు

రాష్ట్రంలో నేరాల నివారణకు, కేసుల దర్యాప్తులో అధునాతన పద్ధతులు అవలంబించడంతోపాటు ప్రజారక్షకులుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని డిజిపి ద్వారకాతిరుమలరావు అన్నారు. నగరంలోని ఏలూరు రేంజ్ పోలీసు కార్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. తొలుత ఆయనకు రేంజ్ ఐజి అశోక్‌కుమార్‌తోపాటు రేంజ్ పరిధిలోని ఎస్‌పిలు స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌పిలతో నేర సమీక్షా సమావేశం డిజిపి నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేంజ్ పరిధిలో నేరాలపై సమీక్షించామని తెలిపారు. నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలతోపాటు హత్యలు, అత్యాచారాలు, మైనర్లపై అఘాయిత్యాలు, ఆస్తుల వివాదాలు, గంజాయి కేసులు వంటి వాటి దర్యాప్తు, శాఖలో డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై చర్చించామన్నారు. విజయవాడ, విశాఖపట్నంలో సైబర్ సెల్ పోలీసు స్టేషన్లు ఉన్నాయని, వీటిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు రంగం సిద్ధం చేశామని చెప్పారు. సైబర్ నేరాల్లో ప్రస్తుతం పోగొట్టుకున్న సొమ్ము వెనక్కి వెనక్కి తీసుకొచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నివారణకు జిల్లాకు ఒక నార్కొటిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నామన్నారు. పోలీస్ క్యాంటీన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజి జి.అశోక్‌కుమార్, ఎస్‌పిలు ప్రతాప్ శివకిషోర్(ఏలూరు), అద్నాన్ నయీం అస్మీ(పశ్చిమగోదావరి), నరసింహారావు (తూర్పుగోదావరి), ఆర్.గంగాధర్‌రావు (కృష్ణా), విక్రాంత్ పాటిల్ (కాకినాడ), బొడ్డేపల్లి కృష్ణారావు (అంబేద్కర్ కోనసీమ), అధికారులు పాల్గొన్నారు. జిల్లాకు విచ్చేసిన డిజిపి ద్వారకాతిరుమలరావును కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు, దెందులూరు ఎంఎల్‌ఎలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వైసిపి హయాంలో కానరాని అభివృద్ధి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి మచ్చుకు కూడా కన్పించలేదని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి మండలం వెలగలపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై భారీ గుంతలు పడి రాకపోకలు ప్రమాదకరంగా మారడంతో ఎంఎల్ఎ స్వయంగా రంగంలోకి దిగి జెసిబి సాయంతో భారీ గుంతలను పూడ్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రోడ్ల దుస్థితికి గత వైసిపి ప్రభుత్వమే కారణమన్నారు. కనీసం గుంతలు కూడా పూడ్చకపోవడంతో వైసిపి అడ్రస్ గల్లంతయ్యిందన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

21 నుంచి నవచైతన్యం

జయప్రదం చేయాలి: ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవ కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 21వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ మహనీయుల ఆశయాల బాటలో నవ చైతన్యం పేరుతో నిర్వహిస్తున్న సభలు, పోటీలు, చైతన్య కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం పవర్‌పేటలోని అన్నే భవనంలో ఎవిఆర్ విజ్ఞానకేంద్రం నిర్వాహక కమిటీ, వివిధ సంఘాల సమావేశం రిటైర్డ్ లెక్చరర్ పి.ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ నవ చైతన్యం పేరుతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహనీయులు, ప్రముఖులు గురజాడ అప్పారావు, అడవి బాపిరాజు, జ్యోతిరావు పూలె దంపతులు సత్యశోధన సమాజం ఏర్పాటు, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, ఉన్నవ లక్ష్మీనారాయణ, రాజా రామ్మోహన్‌రాయ్, భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతులు, వర్ధంతుల_సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, సందేశాత్మక పాటలు, ఉపన్యాసం పోటీలు జరుగుతాయని అన్నారు. బోఫ్, భారత్ బచాయో, హేలాపురి సింగర్స్ అసోసియేషన్, సాహిత్య మండలి ఒకరోజు కార్యక్రమ బాధ్యత తీసుకుని విద్యాలయాలలో సమన్వయ బాధ్యత చేస్తారని అన్నారు. 9 రోజుల నవచైతన్యం కార్యక్రమ కన్వీనర్‌లుగా మాతృదేవో భవ సేవా ట్రస్ట్ కార్యదర్శి కూచిపూడి సత్యనారాయణ, సర్ సిఆర్‌ఆర్ డిగ్రీ రిటైర్డ్ లెక్చరర్ పి.ఆంజనేయులు బాధ్యతలు నిర్వహించేలా సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. అనంతరం పి.ఆంజనేయులు మాట్లాడుతూ స్కూల్స్, కాలేజీల యాజమాన్యం, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 21 నుంచి 29 మధ్యలో రోజు వారీ ప్రముఖుల జీవిత ప్రత్యేకతలు తెలిపే కార్యక్రమం ఎంతో ఉపయోగం అని అన్నారు. ఈ సందర్భంగా నవ చైతన్యం ఫ్లెక్సీ, కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, గుబ్బల నాగేశ్వరరావు, డి.దిలీప్ కుమార్, మేతర అజయ్ బాబు, కె.సోమ్లా నాయక్, ఎస్.రవి, డి.గణేష్, పెరియార్ పూలె, పి.సూర్య ప్రకాష్, సి.రవి, వై.నిర్మల, పి.రవీంద్ర నాథ్, కె.జనని పాల్గొన్నారు.

గోనె సంచుల ఇబ్బందుల్లేకుండా చర్యలు

రైస్‌మిల్, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో జెసి ఆకస్మిక తనిఖీ

జంగారెడ్డిగూడెం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లోని ధాన్యం సేకరణలో గోనె సంచులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. బుధవారం కేతవరంలో రైతు సేవాకేంద్రాన్ని, జంగారెడ్డిగూడెంలోని విష్ణుప్రియ రైస్‌మిల్లు, ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోనె సంచులు నిల్వ చేసేందుకు గోడౌన్లను సిద్ధం చేస్తున్నామని, అందులో భాగంగా సంబంధిత గోదాముల సన్నద్ధతను పరిశీలిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. మధ్యం దళారీల మాటలు నమ్మవద్దని సూచించారు. అనంతరం విష్ణుప్రియ రైస్ మిల్లును ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సన్నద్ధతను పరిశీలించారు. తేమశాతం ఏవిధంగా కొలిచేది, మిల్లు సామర్థ్యం తదితరాలను పరిశీలించారు. అనంతరం ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను జెసి ధాత్రిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి నిల్వల వివరాలను పరిశీలించారు. జెసి వెంట జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజూ భార్గవి, డిఎస్ఒ ఆర్‌ఎస్‌ఎస్.రాజు, మండల తహశీల్దార్ కె.స్లీవజోజి ఉన్నారు.

ఎస్ఐ నరసింహారావు గుండెపోటుతో మృతి

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు సిసిఎస్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్న డిఇ నరసింహారావు గుండెపోటుతో బుధవారం రాత్రి మృతిచెందారు. ఏలూరు నగరానికి చెందిన డి.నరసింహారావు స్థానిక సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు గలరు. ఒక కుమారుడు వైద్యుడిగా పనిచేస్తుండగా మరో కుమారుడు సెక్రటరీగా పని చేస్తున్నారు. ఈక్రమంలో ఆయన బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని గ్రీన్ సిటీలోని ఆయన స్వగృహం వద్ద సందర్శనార్థం ఉంచారు.

వరద బాధితులకు సిఐటియు ఆపన్న హస్తం

గోగుంట, వేలేరుపాడుల్లో నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - పెదపాడు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ముంపునకు గురై సర్వం కోల్పోయిన గోగుంట ఎస్‌సి కాలనీ పేదలకు సిఐటియు జిల్లా కమిటీ తరపున బుధవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. జిల్లాలోని సిఐటియు అనుబంధ సంఘాలు అంగన్వాడీ, ఆశ తదితర రంగాల్లోని కార్మికుల ద్వారా సేకరించిన సహాయంతో 110 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గోగుంటలోని చర్చి వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుడమేరు తదితర డ్రెయిన్లు ఉప్పొంగి వేలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. కార్మికులు, ప్రజల నుండి సేకరించిన కొద్దిపాటి సొమ్ముతో సర్వం కోల్పోయిన పేదలకు ఆదుకోవడానికి సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. విజయవాడలో వరద బాధితులకు పది రోజులపాటు వేలాదిమందికి ఆహార ప్యాకెట్లు, భోజనం పంపిణీ చేశామన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు మండలాల్లోని ఐదు గ్రామాల్లో సుమారు 700 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేశామన్నారు. వరదల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరదలు, వర్షాల సమయంలో దళితులు, బలహీనవర్గాలు నివశించే కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరద బాధితులను పూర్తిగా ఆదుకోవాలని కోరారు. ముంపు శాశ్వత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కొర్ని విజయలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నేతలు కె.దేవమణి, అన్నపూర్ణ, కుసుమ, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు లోకేశ్వరి, దుర్గ, నాగలక్ష్మి, లలిత, నాగమణి, సిపిఎం నాయకులు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



పెదపాడు: సరుకులు అందిస్తున్న నాగేశ్వరరావు

వేలేరుపాడు రూరల్: మండలంలో గోదావరి వరదలకు సర్వం కోల్పోయిన బాధితులకు సిఐటియు ఆధ్వర్యాన బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిఐటియు జిల్లా కార్యదర్శి తెల్లం నాగమణి మాట్లాడుతూ వేలేరుపాడు మండలంలో ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదలకు గ్రామాలకు గ్రామాలే నీట మునిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. మరోపక్క వ్యవసాయ పనులు లేక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పునరావాసం కల్పన, పరిహారం అందజేతలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తక్షణం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిస్థాయిలో కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం రూ.40 వేలు విలువ చేసే సరుకులు మంచి నూనె, కందిపప్పు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నేత మడివి దుర్గారావు, సిపిఎం మండల కార్యదర్శి ధర్మల రమేష్, సిఐటియు నేతలు వై.సాయి, లత, నయోమి, సిపిఎం నాయకులు ఊకే రాజు, సీతయ్య, లింగయ్య, వలీపాషా తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు: సరుకులు అందిస్తున్న రవి, నేతలు

మత్తె బాబికి పలువురు అభినందన

ఏలూరు సిటీ: రిపబ్లిక్ ఆఫ్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగ్ బాధ్యతలు చేపట్టిన మత్తె బాబికి పలువురు అభినందనలు తెలిపారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం వద్దఉన్న లేడీస్ లయన్స్ క్లబ్‌లో బుధవారం మత్తె బాబికి పలువురు దళిత నాయకులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీకి తనను రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. బహుజన పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పురుగుమందు పిచికారీపై అవగాహన

ముసునూరు : వ్యవసాయ రంగంలో నూతన ఆధునిక రంగం ద్వారా అభివృద్ధి పథంలోకి దూసుకు వెళ్లే విధానంలో ముందంజలో ఉన్నామని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధు మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని చెక్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెక్కపల్లి గ్రామస్తులకు డ్రోన్ పరికరం ద్వారా వ్యవసాయ పంటలకు పురుగుమందు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. 12 లీటర్లు, 15 లీటర్ల డోస్లు అందుబాటులో ఉన్నాయని, వీటిపై 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందజేస్తుందని తెలియజేశారు. ఆదివిదంగా ఇంటర్మీడియట్ చదివి లేదా ఆపైన చదివిన నిరుద్యోగులకు 50 శాతం సబ్సిడీపై అందజేయడమవుతుందని తెలిపారు. ఈ డ్రోన్ పరికరం వాడటం వల్ల కూలీలు కొరత తగ్గించవచ్చన్నారు. రైతులు, అగ్రానిక్ ఫామ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిన వెంకన్న హుండీ లెక్కింపు

ఆదాయం రూ.2,05,16,675

ద్వారకాతిరుమల : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు బుధవారం ఉదయం ప్రధాన మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ లెక్కింపు జరిపారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 28 రోజులకు రూ.2,05,16,675 ఆదాయం వచ్చింది. భక్తుల కానుకల రూపేణ 197 గ్రాముల బంగారం, 4 కేజీల 406 గ్రాముల వెండి, పాత రూ.500(11నోట్లు), రూ.1000(2 నోట్లు), రూ.2 వేల(3 నోట్లు), పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాదరావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు పరామర్శ

కామవరపుకోట : గత కొద్ది రోజులు క్రితం కారు ప్రమాదానికి గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని రామన్నపాలెంకి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిపి పోలిన నాగేశ్వరరావుని రామన్నపాలెంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి, మాజీ ఎంఎల్ఎ పీతల సుజాత పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మాజీ జెడ్‌పిటిసి ఘంటా సుధీర్ బాబు, జలవర్తి రాంబాబు, మద్దిపాటి నాగ లింగేశ్వరావు, ఒబ్బిలనేని వెంకన్న, అబ్బూరి సూర్య ప్రసాద్ రావు, అబ్బూరి లక్ష్మీ నారాయణ, వడ్లమూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

టి.నరసాపురం : కేంద్రంలో మోడీ సర్కార్, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు టివిఎస్.రాజు అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బుధవారం పట్టణ ప్రకటన ద్వారా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలను తగ్గిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా గతం కంటే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

దేవిడ్‌రాజు సర్టిఫికెట్ పొందడం అభినందనీయం

కామవరపుకోట : మండలంలోని కొమ్ముగూడెం అనే మారుమూల పల్లెలో జన్మించిన చింతపల్లి దేవిడ్ రాజు జర్మనీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన మెంటల్ కాల్కులేషన్ వరల్డ్ కప్ ఇండియా తరపు నుంచి మ్యాథమెటిక్స్ ప్రతినిధిగా పాల్గొని సర్టిఫికెట్ పొందటం గర్వించదగిన విషయమని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు అన్నారు. గణిత శాస్త్ర విభాగంలో పలు విధానాలను ఆవిష్కరిస్తూ గణిత మాంత్రికుడుగా పేరొందిన దేవిడ్ రాజు ప్రస్తుతం రామకృష్ణాపురం జిల్లాలో ఒక ప్రయివేట్ కళాశాలలో పనిచేస్తున్నారు. దేవిడ్ రాజు తన విధులు నిర్వహిస్తూనే గణితంలో అనేక నూతన ఆవిష్కరణలు చేయడం ఆయనలో ఉన్న ప్రతిభకు తార్కాణమని చెప్పుకోవచ్చని మధు అన్నారు. దేవిడ్ రాజు ప్రతిభను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా ప్రోత్సహించాలని మధు కోరారు.

చుక్కల భూముల వివరాలు పారదర్శకంగా అందించాలి

ఉంగుటూరు : నిషేధిత భూముల(చుక్కల భూములు) వివరాలు గ్రామాల వారిగా సర్వేయర్లు వివరాలను సిద్ధం చేయాలని ఉంగుటూరు తహశీల్దార్ బొద్దపల్లి దుర్గాప్రసాద్ ఆదేశించారు. మండల సర్వేయర్ పొన్నాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వేయర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిషేధిత భూముల లావాదేవీల వివరాలను పారదర్శకంగా ప్రభుత్వానికి పక్కా సమాచారాన్ని అప్పజెప్పాలని ఉన్నారు. ఈక్రమంలో ఈనెల 19న స్పెషల్ కలెక్టర్ భాస్కర్ ఉంగుటూరు రానున్నారు.

డివిజి శంకరరావును కలిసిన రవికుమార్

కామవరపుకోట : మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా రాజన్నలు, నాయక్ అను కులానికి చెందిన ప్రజలు కుల సర్టిఫికెట్ కోసం పడుతున్న ఇబ్బందులను గురించి జిల్లా ఎస్సి, ఎస్టీ కేసుల విజిలెన్స్ సభ్యుడు గుర్రాల రవికుమార్ రాష్ట్ర ఎస్సి కమీషన్ చైర్మన్ డివిజి శంకరరావును విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చైర్మన్‌కి వివరించినట్లు రవి కుమార్ తెలిపారు.

పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేత

ఏలూరు స్పోర్ట్స్ : జరీవల కాలంలో జరిగిన నేరాలు, తక్షణ సమయంలో నిందితులను అరెస్ట్ చేసిన వారికి రాష్ట్ర డిజిపి ద్వారకాతిరుమలరావు ప్రశంసా పత్రాలను అందించారు. ఇందులో భాగంగా జిల్లా నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలోని ఒక గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అత్యాచారానికి పరిజ్ఞానం వినియోగించి అతి తక్కువ సమయంలో పోలీసులు చేధించారు. ఈ కేసుకు సంబంధించి ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, నిడమర్రు సిఐ సుబ్రహ్మణ్యం ద్వారా డిజిపి ప్రశంసా పత్రాలను అందించారు. నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో అత్యాచారానికి గురైన మైనర్ బాలిక భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, నూజివీడు సివిలు సంయుక్తంగా రూ.లక్ష వీరాజన్ని బాధిత బాలిక తల్లిదండ్రులకు రాష్ట్ర డిజిపి ద్వారకాతిరుమలరావు చేతుల మీదుగా చెక్కును అందించారు. ఈ లక్ష రూపాయల విరాళంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ రూ.50 వేలు, మిగిలిన పోలీసు సిబ్బంది రూ.50 వేలు వారి సొంత సొమ్మును బాధిత బాలిక తల్లిదండ్రులకు అందించారు.

భర్త వివాహేతర సంబంధంపై భార్య ఫిర్యాదు

పోలవరం : భర్త వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని ముగ్గురు పిల్లలతో ఉన్న తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని బుధవారం ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్ కుమార్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పోలవరం పంచాయతీ భూపాల్ కాలనీకి చెందిన కోడేశ్వరరావు పోలవరానికి చెందిన ఒకరి మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, ఈ విషయంపై అతని భార్య పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇప్పించిందని. అయినప్పటికీ తన ప్రవర్తనను మార్చుకోకుండా ఆమెను వేధిస్తూ ఆ మహిళ వద్దకు వెళ్ళి సహజీవనం చేస్తున్నాడని తెలిపారు. వేరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళ ఇంటికి వెళ్లి వారిద్దరిని నిలదీయగా అద్దాలు ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డాక్టర్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

ఏలూరు స్పోర్ట్స్ : గాయాలు లేవు ఎంఎల్‌సి ఎలా చేయాలని అడిగిన వైద్యురాలిపై పరుష పదజాలంతో చెలరేగిపోయి దాడికి యత్నించిన వ్యక్తిపై, అతని తరపున వచ్చిన రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు నగరంలోని సర్వజన ఆస్పత్రిలో అత్యవసర విభాగంలో 17వ తేదీ తెల్లవారుజామున ఒంటిగంట ముప్పై నిమిషాల ప్రాంతంలో డాక్టర్ రమ్య సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా రాత్రి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆంజనాపురం ప్రాంతానికి చెందిన వై.శ్రీనివాస్ అనే వ్యక్తి వైద్య సహాయం నిమిత్తం అత్యవసర విభాగానికి వచ్చారు. దీంతో రమ్య దుగ్గర తనకు వైద్యం చేయించుకుంటు తదుపరి గాయాలను బట్టి ఎంఎల్‌సి నమోదు చేస్తామని శ్రీనివాస్‌కు తెలిపారు. దీంతో శ్రీనివాస్ పరుష పదజాలంతో ఆమెపై విరుచుకుపడ్డాడు. పక్కనే ఉన్న బొడ్డేటి మోహన్ అనే వ్యక్తి శ్రీనివాస్‌కు అనుచరుడిగా ఉన్నాడు. అతను కూడా డాక్టర్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తూ స్థానిక ఎంఎల్‌సి చేయకుండా వారిని అడిగారు. భయభ్రాంతులకు గురైన రమ్య రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి ప్రశ్నించే ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నగర పంచాయతీ అభివృద్ధి జరిగేదెన్నడో!

వీధి లైట్లు కూడా లేని దుస్థితి పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మేజర్ గ్రామపంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీగా మారి నాలుగు సంవత్సరాలు కావస్తుంది. అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉంది. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల పరిస్థితి పట్టించుకునే నాథుడే లేడని సిపిఎం పట్టణ కన్వీనర్ ఎస్.సూర్యకుమార్ అన్నారు. కనీసం వీధి దీపాలు వెలిగించలేని దుస్థితిలో నగర పంచాయతీ ఉందని, పట్టణంలో సగానికిపైగా వీధి దీపాలు నెలల తరబడి వెలగటం లేదని అన్నారు. చింతలపూడి సెంట్రల్ లైటింగ్ పట్టించుకునే నాథుడు కరువయ్యాడని మండిపడ్డారు. బుధవారం నగర పంచాయతీ అభివృద్ధిపై ఆయన స్పందించారు. పట్టణంలో రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని, మురుగునీరు పారుదలకు డ్రైనేజీ కొత్త ప్రతిపాదనలు ఎక్కడా లేవని, కార్మికులకు చెల్లించవలసిన వేతనాల వ్యత్యాస బకాయిలు లక్షలాది రూపాయలు కూడా చెల్లించటం లేదని మిమర్శించారు. ఆస్తిపన్నులు, వివిధ రకాల ఇతర పన్నులు మున్సిపాలిటీ పేరుతో ప్రజల వద్ద నుండి గుంజుతున్నారు కాని ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో గతంలో మేజర్ పంచాయతీ కంటే చింతలపూడి మున్సిపాలిటీ వెనుకబడి ఉందన్నారు. సెంట్రల్ లైటింగ్ గురించి అధికారులు, నాయకులు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. నగర పంచాయతీలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, చింతలపూడికి నిత్యం మహిళలు ఏదో పనిమీద వస్తున్నారని, పాత బస్టాండ్ పరిధిలో ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేని మహిళలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల క్రితం పాలకవర్గం లేకపోవడం కూడా ఒక ప్రత్యేక లోటుగా కనిపిస్తుందని, నూతనంగా ఎన్నికైన ఎంఎల్ఎ, ఎంపీ చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు ప్రభుత్వం నుంచి సేకరించి చింతలపూడి నగర పంచాయతీని అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లాలని సిపిఎం కోరుతుందని అన్నారు.

వరద బాధితులకు చేయూత

ఏలూరు సిటీ: మానవతా దృక్పథంతో బాధితులకు అందరూ సహాయం చేయాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన కుటుంబాలకు అండగా నిలబడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో భారీ రిలీఫ్ ఫండ్‌ను స్వయం సహాయక సంఘ సభ్యుల ద్వారా (గ్రూపుకు రూ.100 చొప్పున మెప్మా విభాగం విరాళాలు కలెక్ట్ చేశారు. ఏలూరులో ఉన్న 4,500 మెప్మా సంఘాలకు రూ.100 చొప్పున రూ.4 లక్షల 50 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ నూర్జహాన్ పెదబాబు చేతుల మీదుగా పవర్ పేటలోని ఎంఎల్ఎ పార్టీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రూ.4 లక్షల 50 వేల ఫండ్‌ను అందరి భాగస్వామ్యంతో కలెక్ట్ చేసిన మెప్మా వారికి, సహాయం చేసిన అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎలాంటి విపత్తులు వచ్చినా అందరూ ధైర్యంగా నిలబడాలని, అందరూ మానవతా దృక్పథంతో సహాయానికి ముందుకు రావాలని కోరారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కె.సుధాకర్ రావు, నగరపాలక సంస్థ సిఒ కృష్ణమూర్తి, మెప్మా సిఒలు, ఆర్‌పిలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముసునూరు : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముసునూరు భారతీయ విద్యానికేతన్ పాఠశాల తరఫున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ప్రిన్సిపల్ కొండేటి విజయలక్ష్మి శౌరి చెప్పారు. బుధవారం వరద బాధితుల సహాయార్థం భారతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సహకారంతో రూ.43,854 ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించారు. సహకారం అందించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

టి.నరసాపురం : విజయవాడ వరద బాధితులకు సాయంగా రూ.లక్ష చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బుధవారం ఆయన చాంబర్లో కలిసి అందజేసినట్లు టిడిపి ప్రధాన కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ బాధితులకు చంద్రబాబు నాయుడు అండగా నిలబడ్డారని, ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సాయం అందించారన్నారు. తనవంతు సాయంగా రూ.లక్ష అందించినట్లు తెలిపారు. ఆయన వెంట శ్రీరామమూర్తి తనయుడు శేఖర్, నవీన్‌లు ఉన్నారు.

పోలవరం : విజయవాడ వరద బాధితులకు మండలంలోని ప్రేయర్ టీం సభ్యులు బుధవారం నిత్యావసరాల కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దైవ జనులు పిజె సుధాకర్ మాట్లాడుతూ మండల పాస్టర్ల సంఘం ఆర్థిక సహకారంతో రూ.లక్ష విలువైన నిత్యావసరాల కిట్లు విజయవాడలోని సింగ్‌నగర్, వైఎస్ఆర్ కాలనీ వరద బాధితులకు 275 కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. బి.జయరాజు, మోజెస్ శాస్త్రి, ఇమ్మానుయేలు, క్రిష్టాఫర్, జోసెఫ్ రాజు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గర్భిణులు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సిడిపిఒ పి.మాధవి సూచించారు. చింతలపూడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సాంప్రదాయ పద్ధతిలో పండ్లు, పువ్వులు, చీర పంచిని అందజేశారు. ముందుగా పోషణ అభియాన్ ర్యాలీ నిర్వహించి, పోష్టికాహారం ఆవశ్యకతపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత పెరుగుదల, పర్యవేక్షణ అనుబంధ పోషకాహారం మెదడులోని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లీలా కుమారి, అంగన్వాడీ టీచర్స్, ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకుకూరలతోనే ఆరోగ్యం

ముదినేపల్లి : పోష్టికాహార మాసోత్సవాలలో భాగంగా పోషకాహారం పై ముఖ్యంగా ఆకు కూరలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూపర్వైజర్ ప్రసన్న అన్నారు. మండల పరిధిలోని బొమ్మినంపాడు సచివాలయం పరిధిలో అంగన్వాడీ కేంద్రం-1లో బుధవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా తొమ్మిది మాసాలు నిండిన గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ప్రసన్న గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన పోషకాలు, ఆకుకూరల ప్రాముఖ్యత గురించి వివరించారు. వీటిని తీసుకుంటే రక్తహీనత అరికట్ట ఉండవన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని ఇటుకలకోట, వింజరం పంచాయతీలలో బుధవారం గర్భిణులకు అంగన్వాడీ సూపర్వైజర్ రాణి ఆధ్వర్యంలో అంగన్వాడీలు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎల్లంపేట సెక్టార్ సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో కొత్త పట్టిసీమలో అంగన్వాడీల పోషణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గర్భవతులు, బాలింతలు, అంగన్వాడీ శిశువుల తల్లులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు రియల్ హీరోలు

ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

పెదపాడు : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, గ్రామంలో స్వచ్ఛత అందరి బాధ్యత అని ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడులో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం బుధవారం ఆయన ప్రారంభించారు. నిరంతరం పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు రియల్ హీరోలు అన్నారు. పారిశుధ్య పరిరక్షణ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. టిడిపి మండల అధ్యక్షుడు లావేటి శ్రీను, గుత్తా అనిల్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని స్వచ్ఛతా హి సేవా-2024 కార్యక్రమాన్ని రెండవ రోజైన బుధవారం కొనసాగాయని ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. ప్రధానంగా దోమల నిర్మూలనకు మలాథిన్ ద్రావణాన్ని స్ప్రే చేయడం, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు అవగాహన సదస్సులు, ర్యాలీలు పలు గ్రామాలలో నిర్వహించినట్లు తెలిపారు. కురెళ్ళగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగ గౌతమి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థులకు పారిశుధ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం, పురవీధులలో ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ధర్నా

ముసునూరు : దళితులు సాగు చేసుకుంటున్న భూమిలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇన్పుట్ సబ్సిడీ, రైతు భరోసా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించక అధిక వడ్డీలతో తీవ్రంగా నష్టపోతున్నారని, వీరిని ఆదుకోవాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం(ఆయార్ల) నాయకులు తెలిపారు. జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం ముసునూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణక్కపేట గ్రామపంచాయతీ పరిధిలో సుమారు ఎస్సి దళిత పేదలు 60 మంది భూమిని సాగు చేసుకుని మామిడి, జీడి మామిడి, మొక్కజొన్న, పామాయిల్, నిమ్మ, కంది, తదితర పంటలు పండిస్తున్నారన్నారు. 40 సంవత్సరాల నుంచి కొంతమంది పేదలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, వీరికి ఆ భూములు తప్ప వేరే ఏవిధమైన సాగు భూములు లేవని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోతున్నారని ఆదుకోవాలని కోరారు. సంఘం సభ్యులు వేముల చంటి, ఆమదాల చినబాబు, గరిక అఖిల్, పల్లిపాము భవాని, జుజ్జువరపు మహాలక్ష్మి పాల్గొన్నారు.

20న ఆటల పోటీలు

భీమడోలు : భీమడోలు హైస్కూల్ వేదికగా ఈనెల 20వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు గేమ్స్ విభాగం మండల కన్వీనర్ వి.వెంకటేశ్వరావు తెలిపారు. ఇదే క్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి వారిని ఉంగుటూరు నియోజకవర్గంలో జరిగే క్రీడా పోటీలకు ప్రతినిధులుగా పంపనున్నట్లు ఆయన చెప్పారు. క్రీడా పోటీలు అండర్-14, అండర్-17 విభాగాలలో ఉంటాయన్నారు. ఆట పోటీలను అథ్లెటిక్స్, యోగ, చదరంగం, షటిల్, కబడీ, వాలీబాల్ అంశాలలో నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారని చెప్పారు.

ప్రమాద బాధితున్ని పరామర్శించిన మంత్రి

మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబందికి సూచన

ప్రజాశక్తి - ముసునూరు

ఆపదలో ఉన్నవారిని ఎంత దూరమైనా వెళ్లి ఆదుకునే వ్యక్తి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అని ఆ బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకెళితే.. కాటేనిపాడుకు గ్రామానికి చెందిన వీరపల్లి శ్రీనివాస్ కుటుంబ పోషణకు హైదరాబాద్‌లో ఉంటూ రాడ్ బెండింగ్ పని చేసుకుంటున్నాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈనెల 15న ఆయన రాడ్ బెండింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగి గాయాలయ్యాయి. ఈమేరకు హైదరాబాద్‌లోని ఎంఎంఆర్ హాస్పిటల్ ఐసియులో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి పార్థసారథి హైదరాబాద్ వెళ్లి వీరపల్లి శ్రీనివాస్‌ని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పార్థసారథి

ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి మెరుగైన వైద్యం అందజేయాలని కోరి భరోసా కల్పించారు.

ఎర్రచందనం సాగు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

టి.నరసాపురం: ఎర్రచందనం సాగుచేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని మక్కినవారిగూడెం, కృష్ణాపురం, గంగినీడుపాలెం గ్రామాలకు చెందిన రైతులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కొల్లివారిగూడెంలో రైతు సిరిమళ్ల సూర్యప్రకాష్‌కు చెందిన ఎర్ర చందనం తోటలో బుధవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గత 25 ఏళ్ల నాటి నుంచి కొల్లివారిగూడెం, కృష్ణాపురం, మక్కినవారిగూడెం, ఏపిగుంట, గంగినీడుపాలెం తదితర గ్రామాల్లో సుమారు 10 మంది రైతులు ఎర్ర చందనం సాగు చేస్తున్నారు. మొత్తం సుమారు వెయ్యికి పైగా ఎర్ర చందనం చెట్లు ఉన్నాయన్నారు. ఎర్రచందనం సాగు ద్వారా మంచి ఆదాయం వస్తుందని ఆశతో 41 ఏళ్ల క్రితం సిరిమళ్ల సూర్యప్రకాష్ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఈ వ్యవసాయం చేపట్టారని, ఆయన ద్వారా మరికొందరు కూడా తమ వ్యవసాయ భూమిలో సాగు చేపట్టామని తెలిపారు. కాని నాటి నుంచి నేటి వరకు ఎర్రచందనం చెట్లను కొనుగోలు చేసే వారు లేరన్నారు. ఎంతో మంది దళారులు వచ్చి వెళుతున్నారే తప్ప కొనడం లేదని వాపోయారు. ఎర్రచందనం చెట్టు అమ్ముకుంటే ఎంతో మంచి ఆదాయం వస్తుందని, తమ ఇబ్బందులు తీరతాయనుకున్నామన్నారు. మొక్కలు వేసిన కొంత కాలం అంతర పంటలు సాగు చేసామన్నారు. కాని గత 25 ఏళ్లుగా చెట్లను కొనేవారు లేక, ఆదాయం రాక ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు వాపోయారు. ప్రభుత్వం స్పందించి మండలంలోని ఎర్రచందనం సాగుచేస్తున్న రైతుల వద్ద చెట్లు కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ సమావేశంలో రైతులు సిరిమళ్ల సూర్యప్రకాష్, ముళ్లపూడి రఘురాం, సిరిమళ్ల వెంకట సత్యనారాయణ ఉన్నారు.

పిహెచ్‌సిలో తనిఖీలు

ఏలూరు సిటీ: ఏలూరులోని గజ్జలవారి చెరువు వద్దనున్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ డి.ఆశ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మలేరియా అధికారి డాక్టర్ ఆశ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణతో మాట్లాడుతూ రోగులకు అందుతున్న సేవలపై వాకబు చేసి రోగులకు మంచి సేవలు అందించాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ రికార్డ్స్ పరిశీలించి టెక్నీషియన్స్‌కు ల్యాబ్ పరీక్షల ద్వారా రోగ నిర్ధారణ జరుగుతుందని కాబట్టి ల్యాబ్ పరీక్షలు ఎక్కువగా చేయాలన్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ టెస్టులకు సరిపడా కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఫిల్ హౌస్ పేట 2 వినాయక నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే, లార్వా ఎలిమినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. జిల్లా మలేరియా అధికారి టిఎస్ఎస్.ప్రసాద్, జోనల్ ఎంటమాలజికల్ టీం, ఏలూరు సబ్ యూనిట్ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

దోమల మందును పిచికారీ చేయాలి : ఎంఎల్ఎ

జీలుగుమిల్లి: దోమల మందును గ్రామంలో విధిగా పిచికారీ చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మలేరియా సిబ్బందికి ఆదేశించారు. బుధవారం మండలంలోని జీలుగుమిల్లి పిహెచ్‌సి పరిధిలోని బర్రింకలపాడు గ్రామంలో మూడో విడత దోమల మందు పిచికారీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా విధిగా దోమల మందును పిచికారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు, సర్పంచ్ వనమా రాంబాబు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.విలక్ష్మి పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

జీలుగుమిల్లి : మండలంలోని బర్రింకలపాడు సమీపంలో 7/3 సర్వే నంబర్‌లో 6.50 ఎకరాల విస్తీర్ణంలో 132 కెవి నూతన సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఏపి ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.రామారావు తెలిపారు. బుధవారం ఎలక్ట్రికల్, రెవెన్యూ సిబ్బందితో కలిసి సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదేశంలో సబ్‌స్టేషన్‌ను చేపట్టడం వల్ల మారుమూల ఏజెన్సీ గ్రామాల ప్రజలతో పాటు నిర్వాసిత గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందించడంతో వీలు కలుగుతుందన్నారు. త్వరలోనే ప్రక్రియ అంతా పూర్తిచేసి నిర్మాణ పనులను మొదలు పెట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఎడిఇ కె.రాజశేఖర్, ఏఇఇ రాజ్‌కుమార్, మండల సర్వేయర్ రెడ్డి, వీఆర్‌ఓ బుల్లబ్బాయి, విలేజ్ సర్వేయర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 15 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స, మందులతో పాటు పౌష్టికాహారం కూడా ముఖ్యమని అన్నారు. బుధవారం తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 35 మందికి మధ్యాహ్న భోజనాన్ని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేడిచర్ల శంకరరావు, ప్రొటీన్ పొడర్లను ఏలూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎఎస్‌జెవిబి స్వామి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. డాక్టర్ ఆర్.ఎస్.ఆర్.కె వరప్రసాదరావు పాల్గొన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి

ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, డి.యన్.రావు పేట గ్రామానికి చెందిన మలిశెట్టి మధుబాబు అను నేను ఏలూరు జిల్లా, టి.నరసాపురం గ్రామం మరియు మండలంలో, బంధువుల ఇంటికి మోటారు సైకిల్ పై వెళ్ళు చుండగా టి.నరసాపురం గ్రామ సెంటర్ నందు 10th క్లాస్, ఇంటర్ మీడియట్, డిగ్రీ మరియు యమ్.సి.ఎ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ పడిపోయినవి. నేను బంధువుల ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకుంటే నా ఒరిజినల్ సర్టిఫికెట్స్ కనిపించలేదు. మార్గ మధ్యలో వెతికి చూసినా కనిపించలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

మధుబాబు మలిశెట్టి
7-10/ బి2, డి.యన్.రావు పేట,
రాఘవాపురం, చింతలపూడి మండలం,
ఏలూరు జిల్లా, పిన్: 534460.
ఫోన్ నెం: 94938 48450

మహారాష్ట్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు
ఓ.ఎస్.నెం. 77/2022

పిటీషన్:
కోసూరి వెంకట సుబ్బారావు ...వాది
మరియు
నమ్‌గిద్దా వెంకటేశ్వరరావు & నమ్‌గిద్దా లీలా ...ప్రతివాదులు

టు: డి-5:
నమ్‌గిద్దా మురళి, తండ్రి: లేటు నమ్‌గిద్దా వెంకటేశ్వరరావు, R/o. డో.నెం.9-134, కుమ్మరి బజారు, సీతమ్మగారి హోటల్ లైన్, కెనాల్ ప్రక్కన, కైకలూరు గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.

పైన తెలిపిన దావా ప్రతివాది డి-5 యొక్క హాజరు నిమిత్తం వాయిదా డి.15-10-2024కి తేదీ అయి ఉన్నది. కావున వాయిదా రోజు డి.15-10-2024 ఉదయం గం॥10:30 ని॥లకు కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. లేనిచో వారి పరోక్షములో దావా తీర్మానించబడును.

సింహాద్రి సుబ్బారావు
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
18-10-24. ఫోన్: 94416 53989

మహారాష్ట్రీ 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), ఏలూరు వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 527/2023

మధ్య:
శ్రీ కనకల శేషుబాబు ...వాది
మరియు
శ్రీ కాళ్ళ వీర వెంకట సత్య ఆది వరప్రసాద్ అలియాస్ ప్రసాద్ ...ప్రతివాది

నోటీసు

ప్రతివాదినకు:
శ్రీ కాళ్ళ వీర వెంకట సత్య ఆది వరప్రసాద్ అలియాస్ ప్రసాద్, నివాసం: ఫ్లాట్ నెం. 101, డోర్ నెం. 8-7-4/1, శ్రీ వినాయక ప్లాజా, ఆర్.టి.సి. డిపో వెనుక, కుర్మయ్య పేట, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు వారు నోటీసును ఈ పత్రిక ద్వారా అర్డరు చేసినారు. కావున తదుపరి దావా వాయిదా రోజున అనగా డి. 29-10-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై మీకేమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షములో పై నెంబరు దావా తీర్మానింపబడును అని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

ఏలూరు యం.జి.బి.మురళి, అడ్వకేట్
తేది:12-09-24 ఏలూరు, సెల్: 6281943636

ప్రకటన
మహారాష్ట్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 263/2023

పిటీషన్:
అర్దాల యెస్టేరు రాణి ...వాది
మరియు
ముఖమట్ల మరియమ్మ ...ప్రతివాదులు

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన ముఖమట్ల మరియమ్మ, భర్త: రాఘవులు, డో.నెం. 5-1-22/1, పోలీస్ స్టేషన్ వెనుక, గణపవరం అనే అడ్రసుకు ఎన్నిసార్లు సమన్లు పంపించినాను ఉద్దేశ్యపూర్వకంగా పుచ్చుకొనకుండా కాలయాపన చేయు చున్నందున, కోర్టు వారి ఆర్డరు ప్రకారం ప్రతివాది అయిన ముఖమట్ల మరియమ్మ, భర్త: రాఘవులు, డో.నెం. 5-1-22/1, గణపవరంకు తెలియజేయునది ఏమనగా... పై నెంబరుతో వాది గారు మీపై దావా వేసియున్నారనిన్ని, ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది. కనుక మీరు డి. 24-09-2024న మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10:30 ని॥ల లోగాయతు కోర్టులో హాజరయ్యి ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచవలెను. లేనిచో మీపై పరోక్షముగా తీర్పు చెప్పబడును.

తాడేపల్లిగూడెం, బి.హెచ్.శేషు, అడ్వకేట్,
18-10-24. తాడేపల్లిగూడెం.

ప్రకటన
మహారాష్ట్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) / జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
ఓ.ఎస్.నెం. 125/2023

పిటీషన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం. ...వాది
అండ్
ఆరేపల్లి లక్ష్మి అండ్ అదర్స్ ...ప్రతివాది / ప్రతివాదులు

సమన్స్ టు:
డి-1: ఆరేపల్లి లక్ష్మి, భర్త: రామారావు, డో.నెం. 2-87, 4వ బ్లాక్, గొల్లపాలెం, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం, పుంగోజిల్లా.
డి-2: వేముల సావిత్రి, భర్త: లక్ష్మణ్, డో.నెం. 4-115, 4వ బ్లాక్, గొల్లపాలెం, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం, పుంగోజిల్లా.

పైన వాది వారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించుకోవడం నిమిత్తము మహారాష్ట్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) / జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను మీకు సమన్సు పంపించినాను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా దీ.10-10-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షములో దావా విచారించబడి తీర్మానించబడును అని మీకు తెలియజేయడమైనది.

మోపర్ల సత్యకృష్ణ
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
18-9-24. ఫోన్: 08814 274628

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, డి.యన్.రావుపేట గ్రామానికి చెందిన మలిశెట్టి మధుబాబు అను నేను ఏలూరు జిల్లా, టి.నరసాపురం గ్రామం మరియు మండలంలో, బంధువుల ఇంటికి మోటారు సైకిల్ పై వెళ్ళు చుండగా టి.నరసాపురం గ్రామ సెంటర్ నందు నా పాస్‌పోర్టు నెం: T7016384, వీసా నెం: P9900892, పడిపోయినవి. నేను బంధువుల ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకుంటే నా ఒరిజినల్ పాస్‌పోర్టు కనిపించలేదు. మార్గ మధ్యలో వెతికి చూసినా కనిపించలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియ జేయగలరు.

మధుబాబు మలిశెట్టి
7-10/ బి2, డి.యన్.రావు పేట,
రాఘవాపురం, చింతలపూడి మండలం,
ఏలూరు జిల్లా, పిన్: 534460.
ఫోన్ నెం: 94938 48450

మునిసిపల్ ఆఫీసు, పాలకొల్లు

ఆర్.ఓ.సి. నెం. 769/2015/జి1 డి.18-09-2024

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘ నిధులతో సంఘములోని 27వ వార్డులోని ఎస్‌టిపి గొడౌన్ వద్ద క్రొత్త బోర్ వెల్ కల్వర్ట్ మరియు రేలుపు వద్ద డ్రైన్ (Conservancy lane), 3వ వార్డులోని హెచ్ వాటర్ వర్క్స్ కొత్త వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (11 ఎంఎల్‌డి) నందు 320 కేవిఏ డీజిల్ జనరేటర్ సప్లయ్, డెలివరీ అండ్ installation, 9వ వార్డులో గల కైలాసవనంలో ఫౌంటెన్ ఏర్పాటు చేయు నిమిత్తం (3 పనులకు) గాను అంచనాల విలువ సుమారు రూ. 47,80,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండర్లు డి.19-09-2024వ తేదీ ఉదయం గం॥ 11.00 ని॥ల నుండి లభించును. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు వెబ్‌సైట్ www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారి కార్యాలయము నందు తెలుసుకొనగలరు.

సం/- బి.విజయ సారధి
మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు